న్యూస్‌రీల్

ఇంటర్ పరీక్షల్లో ఐదుగురి డిబార్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో గురువారం జరిగిన ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం పరీక్షల్లో ఐదుగురు విద్యార్థులు డిబార్ అయ్యారని ఇంటర్మీడియట్ డీవీఈఓ సయ్యద్ మౌలా తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఈ నెల 7వ తేదీన ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం గణితం-2ఏ, బోటనీ, సివిక్స్ పరీక్షలు జరిగాయన్నారు. గుడిపాల మండలం బొమ్మసముద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రంలో మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతున్న నలుగురు విద్యార్థులు, చిత్తూరు రూరల్ మండలంలోని ఎన్ఆర్ పేట పరీక్ష కేంద్రంలో ఒకరిని డిబార్ చేసినట్లు తెలిపారు. ఈ పరీక్షకు 14,408 మంది విద్యార్థులకు గాను 13,584 మంది హాజరయ్యారని, 824 మంది గైర్హాజరయ్యారని డీవీఈఓ వెల్లడించారు.

సీసీ కెమెరాల నిఘాలో ఇంటర్ పరీక్షలు



డీవీఈఓ కార్యాలయంలో పరీక్షల తీరును పర్యవేక్షిస్తున్న సిబ్బంది

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న ఇంటర్మీడియట్ పరీక్షలను సీసీ కెమెరాల నిఘాలో పర్యవేక్షిస్తున్నట్లు డీవీఈఓ సయ్యద్ మౌలా అన్నారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతి పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి, వాటిని జిల్లా కేంద్రంలోని డీవీఈఓ కార్యాలయానికి అనుసంధానం చేసి పర్యవేక్షిస్తున్నట్లు వివరించారు. జిల్లా వ్యాప్తంగా 50 కేంద్రాల్లో పరీక్షల తీరును పరిశీలించినట్లు డీవీఈఓ వివరించారు.

అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు ఎమ్మెల్సీ విరాళం



దళిత సంఘాల నేతలకు చెక్కును అందజేస్తున్న భరత్

రామకుప్పం: మండల కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు చిత్తూరు ఎమ్మెల్సీ భరత్ ఐదు లక్షల రూపాయలు గురువారం దళిత సంఘాల నేతలకు విరాళంగా అందజేశారు. ఆయన మాట్లాడుతూ, సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో దళితులకు పెద్దపీట వేశారన్నారు. ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో తగిన ప్రాధాన్యత కల్పించారని అన్నారు. దళిత సంఘాల నేతలు మాట్లాడుతూ, ఎమ్మెల్సీ భరత్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలోమాజీ సర్పంచ్ రఘు, ఏఎంసీ డైరెక్టర్ సతీష్, బందార్లపల్లి సర్పంచ్ రాజగోపాల్, దళిత సంఘ నేతలు గోవిందప్ప, మురుగేష్, జయప్ప ఉన్నారు.

వరసిద్ధుని సేవలో సినీ నటుడు గోపీచంద్



కాణిపాకం: కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామిని సినీ నటుడు గోపీచంద్ దర్శించుకున్నారు. స్వామివారి దర్శనార్థం ఆయన గురువారం రాత్రి విచ్చేయగా ఆలయ సూపరింటెండెంట్ వాసు స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి, తీర్థ ప్రసాదాలు, చిత్రపటం అందించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో పార్టీలకతీతంగా అర్హుల ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందుతున్నాయి. సచివాలయ వ్యవస్థ ద్వారా ఎలాంటి అవినీతి అక్రమాలకు తావు లేకుండా ప్రభుత్వ పథకాలు అందజేస్తున్న ప్రభుత్వం దేశంలోనే ఎక్కడా లేదు. టీడీపీ హయాంలో ఏ పథకం కావాలన్నా, ఆఖరికి సర్టిఫికెట్ కావాలన్నా జన్మభూమి కమిటీల దగ్గరికి వెళ్లాల్సి వచ్చేది. పలమనేరులో ఫ్యాను గుర్తుపై గెలిచిన అమర్ మంత్రి పదవి కోసం పార్టీ మార్చారు. కియా కంపెనీలో ఏజెన్సీలు, కమీషన్ల కోసం ఆ పదవిని వాడుకుని సామాన్యుడి చేతిలో చిత్తుగా ఓడిపోయారు. ఈ సారి ఎన్నికల్లో కూడా ఆయనకు బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారు.

– మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

పలమనేరులో ఆసరా చెక్కును ఆవిష్కరిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎమ్మెల్సీ భరత్, ఎమ్మెల్యే వెంకటేగౌడ



గుమ్మం ముందే సంక్షేమం

- సామాన్యుడి చేతిలో చిత్తుగా ఓడిన అమర్‌కు విమర్శించే అర్హత లేదు
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి
- రూ.16 కోట్లతో నిర్మించిన వంద పడకల ఆస్పత్రి ప్రారంభం
- ఆసరా చెక్కుల పంపిణీ

పలమనేరు: పార్టీలకతీతంగా అర్హులందరికీ గుమ్మం ముందుకే సంక్షేమ పథకాలు అందిస్తున్నామని రాష్ట్ర విద్యుత్, అటవీ, గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. పలమనేరులో నాడు-నేడు ద్వారా రూ.16 కోట్లతో నిర్మించిన వంద పడకల ఆస్పత్రి, అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్మించిన నగరవనం, ఇంటిస్థలాల రిజిస్ట్రేషన్ కన్వేయన్స్ డీడ్స్ పంపిణీ, నాలుగోవిడత వైఎస్సార్ చేయూత చెక్కుల పంపిణీ, ఏనుగు బాధిత రైతులకు రూ.23.61లక్షల చెక్కుల పంపిణీ కార్యక్రమాల్లో ఆయన గురువారం ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్యే వెంకటేగౌడతో కలసి పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ గతంలో ఏ పథకం పొందాలన్నా జన్మభూమి కమిటీల సిఫార్సుల కోసం తిరగాల్సి వచ్చేది. కానీ నేటి వైఎస్సార్ సీపీ పాలనలో అర్హులైన ప్రతి ఒక్కరికీ పార్టీలతో సంబంధం లేకుండా ఇంటి వద్దకే పథకాలు అందుతున్నాయని తెలిపారు. చెన్నై- బెంగళూరు హైవేలో పలమనేరు వద్ద తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతుంటాయని అలాంటి చోట వందపడకల ఆస్పత్రిని రూ.16 కోట్లతో నిర్మించి అత్యవసర సేవలను అందుబాటులోకి తెచ్చినందుకు సీఎంకు కృతజ్ఞతలు తెలపాల్సిందేనన్నారు. రాష్ట్రంలోని అక్క చెల్లెమ్మలకు వైఎస్సార్ చేయూత ద్వారా రూ.6వేల కోట్లను అందించామని తెలిపారు. వైఎస్సార్ సీపీలో ఫ్యాను గుర్తుపై గెలిచిన అమరనాథరెడ్డి, టీడీపీలో చేరి మంత్రి అయ్యారు. ఆయన ఈ ఆస్పత్రి గురించి ఏనాడూ శ్రద్ధ చూపలేదన్నారు. పార్టీ మారి మంత్రి పదవి దక్కించుకున్న ఆయన ఏపీఐఐసీ భూములను తన అనుచరులకు కట్టబెట్టి సంపాదించుకున్నారని విమర్శించారు. పరిశ్రమల శాఖ మంత్రిగా ఇక్కడి జనానికి ఏమీ చేయకపోగా కియాలో తన వాళ్ల పేరుతో ఏజెన్సీలు తీసుకొని లాభపడ్డార ని చెప్పారు. గత ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుతో బరిలోకి దిగిన సామాన్య వ్యక్తి చేతిలో చిత్తుగా ఓడిపోయిన అమరనాథ రెడ్డికి మంత్రిని, ముఖ్యమంత్రిని విమర్శించే స్థాయి లేదని చెప్పారు. రాష్ట్రంలో టీడీపీ ఎన్ని జెండాలను కలుపుకున్నా, పచ్చమీడియా ఎన్ని తప్పుడు కథనాలు వడ్డి వారించినా వైఎస్ జగన్ చేసిన మేలు ప్రజలెవరూ మరిచిపోరని ఆయన స్పష్టం చేశారు.

నగర వనం ప్రారంభం

పలమనేరు మండలం కూర్మాయి సమీపంలో అటవీశాఖ ఆధ్వర్యంలో రూ.20.80లక్షలతో నిర్మించిన నగరవనాన్ని డీఎఫ్వో చైతన్య కుమార్‌రెడ్డితో కలసి మంత్రి ప్రారంభించారు. ఎఫ్ఆర్వో శివన్న, సిబ్బంది, కూర్మాయి పంచాయతీ ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



పలమనేరులో ఆసరా సభకు హాజరైన జనం

రూ.7.73 కోట్ల చెక్కు పంపిణీ

పలమనేరు మున్సిపాలిటీకి సంబంధించి నాలుగో విడత చేయూత కార్యక్రమం మున్సిపల్ చైర్‌పర్సన్ చాముండేశ్వరి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందులో 2,191 మందికి రూ.4.1 కోట్లు, పలమనేరు మండలంలో 1,941మందికి రూ.3.63కోట్లు మొత్తం 7.73కోట్ల విలువైన మెగా చెక్కులను మంత్రి లబ్ధిదారులకు అందజేశారు. పట్టణంలో ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్స్ ద్వారా కన్వేనియన్స్ డీడ్స్‌ను లబ్ధిదారులకు ఆయన అందజేశారు. ఇందులో మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, పట్టణ మాజీ కన్వీనర్ మండీ సుధా, కౌన్సిలర్లు, మెప్మా, డీఆర్‌డీఏ అధికారులు పాల్గొన్నారు.

వంద పడకల ఆస్పత్రి ప్రారంభం



పలమనేరులో వందపడకల ఆస్పత్రిని ప్రారంభిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి

పట్టణంలో నిర్మించిన వందపడకల ఆస్పత్రిలో స్త్రీల ప్రసూతి విభాగం, ఐసీటీసీ, బర్న్ యూనిట్, పోస్ట్ ఆపరేటివ్ వార్డు, బ్లడ్ బ్యాంకు, అటెండెర్ల విశ్రాంతి గది, బయోవేస్ట్ యూనిట్, ఆక్సిజన్ ప్లాంట్, మార్చురీ రూమ్‌ను మంత్రి పెద్దిరెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆస్పత్రి సలహాకమిటీ చైర్మన్ చెంగారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో సూపరింటెండెంట్ నాయక్, ఆర్ఎంవో శారద, మమతారాణి తదితరులు పాల్గొన్నారు.

ఏనుగుల దాడిలో నష్టపోయిన రైతులకు రూ.23.61లక్షల చెక్కుల పంపిణీ

ఏనుగుల కారణంగా గత రెండేళ్లలో పంటనష్టపోయిన వారికి చెక్కులు అందజేశారు. నియోజకవర్గంలో మొత్తం 378 మంది రైతులకు రూ.23.61లక్షల చెక్కులను ప్రజాప్రతినిధులతో కలసి మంత్రి పెద్దిరెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమాల్లో డీసీసీబీ చైర్‌పర్సన్ రెడ్డెమ్మ, మున్సిపల్ చైర్‌పర్సన్ చాముండేశ్వరి, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పవిత్ర, ఏఎంసీ చైర్మన్ హేమంత్‌కుమార్‌రెడ్డి, ఎంపీపీ రోజా, జెడ్పీటీసీ మల్లిక, జెడ్పీ సీఈవో గ్లోరి, ఎమ్మెల్సీ భరత్, కుప్పం మున్సిపల్ చైర్మన్ సుధీర్, ఆస్పత్రి చైర్మన్ చెంగారెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు బైరెడ్డిపల్లి క్రిష్ణమూర్తి, మురళీకృష్ణ, రంగన్న, మండీ సుధా, ఎంపీపీలు మొగసాల రెడ్డెప్ప, పంజాణి రెడ్డెప్ప, కన్వీనర్లు బాలాజీనాయుడు, మోహన్‌రెడ్డి, బాగారెడ్డి, సూపర్‌బజార్ అధ్యక్షులు సుభాష్ చంద్రబోస్, మున్సిపల్ వైస్ చైర్మన్లు గుల్జార్ రహీంఖాన్, రవి, మున్సిపల్ కౌన్సిలర్లు, నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తిరుపతిలో ఆరణి మంటలు

తిరుపతి నియోజకవర్గంలో టీడీపీ, జనసేన పార్టీ నాయకులకు 'ఆరణి' మంటలు రేగాయి. తిరుపతి టికెట్ ఆశించిన ఆ పార్టీ నేతల ఆశలపై చంద్రబాబు నీళ్లు చల్లారు. పొత్తుల్లో భాగంగా చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుకు కేటాయించే యోచనలో ఉన్నట్టు సంకేతాలు రావడంతో ఇరు పార్టీల నేతలు అధినాయకత్వంపై నిప్పులు చెరుగుతున్నారు.



- పొత్తులో భాగంగా జనసేనకే తిరుపతి
- టీడీపీ నేతలకు తేల్చిచెప్పిన అచ్చెన్నాయుడు
- స్థానిక జన సైనికులకు మొండిచేయి
- ఆరణి శ్రీనివాసులు వైపే పవన్ మొగ్గు
- జనసేనలో చేరి టికెట్ తెచ్చుకోవాలనే యోచనలో 'దేశం' నేతలు

సాక్షి, తిరుపతి: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తిరుపతి టీడీపీ నేతలకు షాక్ ఇచ్చారు. పొత్తులో భాగంగా తిరుపతి అసెంబ్లీ స్థానాన్ని జనసేనకు కేటాయించినట్లు ఆ పార్టీ స్థానిక నేతలకు తేల్చి చెప్పేశారు. ఇన్నాళ్లు పార్టీ కోసం అహర్నిశలు కష్టపడి పని చేసినందుకు అధినేత చంద్రబాబు పెద్ద బహుమానమే ఇచ్చారని ఆ పార్టీ తిరుపతి నేతలు మండిపడుతున్నారు. టీడీపీ, జనసేన పొత్తు పెట్టుకున్నప్పటి నుంచి జనసేన నాయకులు తిరుపతి టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్న విషయం తెలిసిందే. నాడు చిరంజీవి తిరుపతి నుంచి పోటీ చేసి గెలుపొందారనే కారణంతో జనసేన శ్రేణులు ఆశలు పెట్టుకున్నాయి. అందులో భాగంగానే పవన్ కల్యాణ్ తిరుపతి స్థానం తమ పార్టీకే కేటాయించాలని చంద్రబాబుని కోరినట్లు తెలిసింది. అయితే చంద్రబాబు ఎటూ తేల్చకుండా నాన్చుతూ వచ్చారు.

ఎట్టకేలకు తేల్చారు..

ఎన్నికల సమయం దగ్గర పడుతుండడంతో టీడీపీ, జనసేన పొత్తులో భాగంగా తిరుపతి సీటును తేల్చేశారు. జనసేనకు కేటాయించాలని నిర్ణయించుకున్నారు. అందులో భాగంగా గురువారం తిరుపతి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, తుడా మాజీ చైర్మన్ నరసింహయాదవ్, జేబీ శ్రీనివాసులుకు చంద్రబాబు కబురు చేశారు. టీడీపీ కార్యాలయం నుంచి పిలుపు అందుకున్న తిరుపతి నాయకులు హడావుడిగా గురువారం అమరావతికి చేరుకున్నారు. తిరుపతి టికెట్ జనసేనకు కేటాయించినట్లు తేల్చిచెప్పారు. అందరూ కలిసి పనిచేయాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడుతో వారికి చెప్పించారు.

జనసేనలో చేరేందుకు యత్నాలు..

తిరుపతి టికెట్ జనసేనకు కేటాయించడంతో టీడీపీలోని ఆశావహులు మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, తుడా మాజీ చైర్మన్ నరసింహ యాదవ్, వూకా విజయ్ కుమార్, జేబీ శ్రీనివాసులు ఎవరికి వారు జనసేన కండువా కప్పుకుని టికెట్ దక్కించుకోవాలని గురువారం అమరావతిలోనే తిష్ట వేశారు.

ఆరణి వైపు పవన్ మొగ్గు ..

చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులును జనసేన అభ్యర్థిగా తిరుపతి నుంచి బరిలో దింపాలని పవన్‌కల్యాణ్ నిర్ణయించుకున్నట్లు సమాచారం. పవన్ హామీ మేరకే ఆయన జనసేనలో చేరినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే పార్టీ పెట్టినప్పుడు నుంచి జెండా మోస్తున్న తమకు కాదని నిన్న పార్టీలో చేరిన వేరే ప్రాంతం వ్యక్తికి ఇక్కడ ఎలా టికెట్ ఇస్తారని జనసేన నాయకులు డాక్టర్ హరిప్రసాద్, కిరణ్ రాయల్ ఆగ్రహంగా ఉన్నట్లు తెలిసింది.

నగరికి మరో మణి మకుటం

- డయాలసిస్ వార్డు ప్రారంభం
- కిడ్నీ బాధిత రోగులకు ప్రభుత్వం ఇచ్చిన వరం
- డయాలసిస్ వార్డు ఏర్పాటుకు ఎంతో కృషి చేశా : మంత్రి ఆర్కేరోజా

నగరి : నియోజకవర్గానికి మరో మణి మకుటం వచ్చింది. కిడ్నీ బాధిత రోగులకు ఊరట లభించింది. మంత్రి ఆర్కే రోజా చేసిన నిర్విరామ కృషి ఎట్టకేలకు ఫలించింది. నగరి ఏరియా ఆస్పత్రిలో డయాలసిస్ వార్డు ఏర్పాటైంది. కిడ్నీ ఫెయిల్యూర్ రోగులకు డయాలసిస్ వార్డును మంత్రి గురువారం ప్రారంభించారు. వార్డులో ఏర్పాటు చేసిన 5 డయాలసిస్ యంత్రాలను పరిశీలించి స్విచ్ ఆన్ చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ నగరి నియోజకవర్గంలో తాను అడిగిన ప్రతి అభివృద్ధి కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి జగనన్న ఆశీర్వదిస్తూ వస్తున్నారని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా కిడ్నీ బాధితులకు డయాలసిస్ సౌకర్యాన్ని కల్పించడానికి 61 కేంద్రాలు నెలకొల్పుతున్నారని వివరించారు. వీటి ద్వారా 515 డయాలసిస్ పరికరాలు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. ఫలితంగా రాష్ట్రంలోని 10 వేలకు పైగా కిడ్నీ బాధితులకు లబ్ధి చేకూరనుందని చెప్పారు. ఉద్దానంలో రూ.50 కోట్ల వ్యయంతో కిడ్నీ రీసెర్చ్ సెంటర్‌ని, రూ.700 కోట్లతో మంచినీటి పథకాన్ని ప్రారంభించి జగనన్న చరిత్ర సృష్టించారని గుర్తుచేశారు. కిడ్నీ బాధితులకు పెన్షన్ ఇచ్చిన ఘనత కూడా జగనన్నకే దక్కుతుందన్నారు. ఇందులో భాగంగా నగరి ఏరియా ఆస్పత్రిలో డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. రూ. 50 లక్షల వ్యయంతో ఐదు డయాలసిస్ యంత్రాలను అందుబాటులోకి తీసకొచ్చినట్లు వెల్లడించారు. నగరితో పాటు పరిసర నియోజకవర్గాల నుంచి సుమారు 500 మంది రోగులకు డయాలసిస్ వార్డు సేవలు అందించనుందన్నారు. ఇదివరలో స్థానికంగా డయాలసిస్ వార్డు లేకపోవడంతో కిడ్నీ బాధితులు చెన్నై, తిరుపతి, చిత్తూరు, శ్రీకాళహస్తికి వెళ్లాల్సి వచ్చేదని చెప్పారు. అయితే ఇది నిరంతర ప్రక్రియ కావడంతో ప్రైవేటు వాహనాలకు బాడుగల చెల్లింపు రూపంలో అధిక మొత్తంలో ఖర్చు చేయాల్సి వచ్చేదని తెలిపారు. వారందరికీ తన వంతు సాయం చేయాలన్న ఉద్దేశంతోనే ఎంతో శ్రమకోర్చి నగరి ఆస్పత్రిలోనే డయాలసిస్ వార్డు ఏర్పాటు చేయించగలిగానని చెప్పారు. తన శ్రమ నేడు 500 కుటుంబాలకు ఉపయోగపడుతుందంటే అది తనకు ఎంతో తృప్తిని ఇస్తోందన్నారు.



డయాలసిస్ వార్డు ప్రారంభోత్సవంలో మంత్రి ఆర్కే రోజా

వైద్యాన్ని గాలికొదిలేసిన చంద్రబాబు

గత పాలనలో చంద్రబాబు వైద్య ఆరోగ్య విభాగాన్ని గాలి కొదిలేసి తన సంపద కోసం మాత్రమే పాటుపడ్డారని గుర్తుచేశారు. చంద్రబాబు పాలనలో ఆరోగ్యశాఖను అమ్మకానికి పెట్టేస్తే జగనన్న ఆ విభాగంపై ప్రజలకు నమ్మకాన్ని కలిగించారన్నారు. గొప్ప వైద్యులు వైద్య సేవల్లో మిరాకిల్స్ చేస్తారని, గొప్ప నాయకులు కూడా చెయ్యగలరని నిరూపించిన నేత జగనన్న అన్నారు. సమావేశానంతరం ఆస్పత్రి ఆవరణలో ఏర్పాటుచేసిన ఆర్వో వాటర్ ప్లాంటును ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, నగరి, నింద్ర ఎంపీపీలు భార్గవి, దీప, ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ ప్రభావతి, ఆస్పత్రి కమిటీ డైరెక్టర్ కృష్ణమూర్తి, డయాలసిస్ వింగ్ ఏపీ ఇన్‌చార్జ్ దిలీప్‌కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్లు బాలన్, వెంకటరత్నం, డాక్టర్ రామచంద్రన్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వైద్యులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

అక్క చెల్లెమ్మలకు చేయూత

- వరుసగా నాలుగో ఏడాది ఖాతాల్లోకి నగదు
- జిల్లాలో 1,04,226 మందికి రూ.195.42 కోట్లు లబ్ధి
- లబ్ధిదారులకు మెగా చెక్కు అందజేత

చిత్తూరు కలెక్టరేట్ : వైఎస్సార్ సీపీ సర్కారు అక్కచెల్లెమ్మలకు వైఎస్సార్ చేయూత పథకంతో భరోసా కల్పిస్తోందని నగర మేయర్ అముద అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం వైఎస్సార్ చేయూత నాలుగో విడత జిల్లా స్థాయి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వర్చువల్ విధానంలో సీఎం ప్రసంగాన్ని ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు అధికారులు వీక్షించారు. నగర మేయర్ మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వమూ చేయని విధంగా వైఎస్సార్ సీపీ సర్కారు అక్కచెల్లెమ్మలకు మేలు చేస్తోందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం వరుసగా నాలుగో ఏడాది వైఎస్సార్ చేయూత పథకాన్ని తమ సర్కారు అమలు చేసిందని చెప్పారు. మహిళలకు చంద్రబాబు మోసం చేశారని విమర్శించారు. జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ చేయూత పథకాన్ని అర్హులందరికీ అందేలా చర్యలు చేపట్టామన్నారు. జిల్లా వ్యాప్తంగా 45 నుంచి 60 ఏళ్ల మహిళలకు ప్రతి ఏటా రాష్ట్ర ప్రభుత్వం రూ.18,750 జమ చేస్తోందన్నారు.



మెగా చెక్కును లబ్ధిదారులకు అందజేస్తున్న మేయర్ అముద, జేసీ శ్రీనివాసులు

నాలుగో విడతలో జిల్లా వ్యాప్తంగా 1,04,226 మంది లబ్ధిదారులకు గాను రూ.195.42 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా జమ చేసిందని తెలిపారు. 2020-21లో 83,156 మందికి రూ.155.92 కోట్లు, 2021-22లో 89,460 మందికి రూ.167.74 కోట్లు, 2022-23లో 1,00,685 మందికి రూ.188.78 కోట్లు ప్రభుత్వం చేయూత పథకానికి ఖర్చు చేసిందన్నారు. అనంతరం లబ్ధిదారులకు మెగా చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ రమ్య, డీఆర్‌డీఏ పీడీ తులసి, మెప్మా పీడీ రాధమ్మ, పలు ప్రాంతాలకు చెందిన లబ్ధిదారులు పాల్గొన్నారు.

ప్రతి ఏటా అందుతోంది



ప్రతి ఏటా వైఎస్సార్ చేయూత పథకం లబ్ధి అందుతోంది. నేను, నా భర్త ఇద్దరం కూలీలే. గతంలో మాలాంటి పేదల కోసం పట్టించుకున్న నాయకుడెవ్వరూ లేరు. ప్రతి ఏటా చేయూత నగదును నా ఖాతాలో జమ చేస్తున్నారు. వరుసగా మూడు సంవత్సరాలు నగదు జమ చేశారు. ఇప్పుడు నాలుగో విడతలో రూ.18,500 అందుతోంది. ఇలాంటి సీఎంను ఎప్పుడూ చూడనేలేదు. ఆయనకు మా ఇంటిల్లిపాది రుణపడి ఉంటాం.

– మీనా, చిత్తూరు మండలం

క్లుప్తంగా

బాలుడికి విద్యుత్ షాక్

పుంగనూరు: పట్టణంలోని ఏటిగడ్డపాళెంలో నివాసం ఉన్న చిన్నరెడ్డెప్ప కుమారుడు లోహిత్ (5) విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. ఇంట్లో గురువారం ఉదయం వాటర్ హీటర్ వద్దకు వెళ్లిన బాలుడికి షాక్ కొట్టింది. వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతి ఆస్పత్రికి తరలించారు.

అక్రమ మద్యం స్వాధీనం



నిందితులను చూపుతున్న డీఎస్పీ

పుంగనూరు: కర్ణాటక నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యం స్వాధీనం చేసుకుని ముగ్గురిని చేసినట్లు పలమనేరు డీఎస్పీ మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఆయన గురువారం మీడియాతో మాట్లాడుతూ సమాచారం మేరకు సీఐ రాఘవరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు చదళ్ల వద్ద కారులో తరలిస్తున్న 20 బాక్సుల టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని, పట్టణానికి చెందిన నారాయణ స్వామి, వెంకటరత్నం, అజయ్‌ను అరెస్ట్ చేసినట్లు చెప్పారు. ఆ కారు సహా వీటి విలువ రూ.1.2 లక్షలుగా అంచనా వేసినట్లు తెలిపారు. ప్రధాన నిందితుడు రాజేష్ పరారీలో ఉన్నట్లు వివరించారు. నిందితులను పట్టుకున్న పోలీసులను అభినందించారు.

నిరంతర కృషితో ఉన్నత లక్ష్యాలు

- మహిళా దినోత్సవంలో మంత్రి రోజా



మంత్రి రోజాను సత్కరిస్తున్న మహిళలు

పుత్తూరు: నిరంతర కృషితో అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చని పర్యాటక, సాంస్కృతిక, యువజన, క్రీడా శాఖ మంత్రి రోజా అన్నారు. స్థానిక షాదీమహల్‌లో గురువారం సాయంత్రం అంతర్జాతీయ మహిళా దినోత్సవ ముందస్తు వేడుకలు నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ మహిళలు ఎన్నో కష్టానష్టాలను అనుభవిస్తూ ఇల్లు చక్కదిద్దుకోవడం నుంచి ఉద్యోగాలు, వ్యాపారాలు వంటి వివిధ రంగాల్లో రాణిస్తున్నారని అన్నారు. నేటి సమాజంలో మహిళలు ఉన్నత లక్ష్యాలను సాధించడంపై నిత్యం సమీక్షించుకోవాలని సూచించారు. ఒకప్పటి మహిళలతో పోల్చుకుంటే, నేటితరం మహిళల ఆలోచనా దృక్పథంలో ఎంతో మార్పు వచ్చిందని చెప్పారు. మహిళా సాధికారత సాధించడానికి విద్య ఒక శక్తివంతమైన ఆయుధమన్నారు. ప్రతి ఆడబిడ్డను విద్యావంతురాలిగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయినులు తమవంతు పాత్ర పోషించాలని సూచించారు. సమాజం మనుగడ గురువుల చేతుల్లోనే ఉందని పేర్కొన్నారు. విద్యకున్న విలువను గుర్తించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని 45 వేల పాఠశాలల రూపు రేఖలను మార్చారని తెలిపారు. రూ.73 వేల కోట్లు ఖర్చు పెట్టి విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన ఘనత సీఎం జగనన్నకే దక్కిందన్నారు. జగనన్న చేపట్టిన విద్యా యజ్ఞంలో ప్రతి ప్రభుత్వ ఉపాధ్యాయుడు భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. అక్షరాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దాల్సిన బాధ్యత గురువులపైనే ఉందన్నారు. ఒక మహిళా మంత్రిగా అన్ని వేళలా అందుబాటులో ఉంటానని, ఎలాంటి సహాయం కావాలన్నా చేయడానికి సిద్ధంగా ఉన్నామంటూ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీఈఓ శేఖర్, మున్సిపల్ కమిషనర్ కేఎల్ఎన్ రెడ్డి, చైర్మన్ ఏ.హరి, వైస్ చైర్మన్లు డి.శంకర్, డి.జయప్రకాష్, మైనారిటీ ఫైనాన్స్ డైరెక్టర్ మాహీన్, కౌన్సిలర్లు, మహిళా టీచర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ముస్లింల చేరికతో వైఎస్సార్ సీపీ మరింత బలోపేతం



మంత్రి పెద్దిరెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన ముస్లిం యువకులు

పుంగనూరు: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి చేపడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ముస్లిం మైనారిటీలు పెద్ద సంఖ్యలో వైఎస్సార్ సీపీలో చేరడంతో పార్టీ మరింత బలోపేతమైందని మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. గురువారం వైఎస్సార్ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు ఎస్‌టీఎఫ్ సిద్దిక్ ఆధ్వర్యంలో 100 మంది ముస్లిం యువకులు పార్టీలో చేరారు. పార్టీలో చేరిన ముజ్జు, నవాజ్, మున్నా, ఇందాద్, వశీం, అబ్దుల్లా, రమీజ్, మోటు, నూర్‌షా, జుబేర్, రోహిత్, గౌస్‌ఫీర్, అయాజ్, అజీజుల్లా, వశీముల్లా, సయ్యద్, షకీల్, వాలీబాల్‌ముజ్జు, షావలి, సాధిక్, రమిజుల్లా, రజీక్, షాకీద్, రోషన్, డ్రైవర్ నూరుల్లా, అఫ్సరుల్లా, అవేజ్, తన్ను, జాఫర్‌అలి, అంజుమ్ తదితరులకు మంత్రి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. మంత్రి మాట్లాడుతూ ముస్లింలకు ఏ సమస్య వచ్చినా సిద్దిక్ తన దృష్టికి తీసుకొస్తే తక్షణమే పరిష్కరిస్తామన్నారు. రానున్న ఎన్నికల్లో ముస్లిం మైనారిటీలు సైనికుల్లా పని చేసి వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చేలా అండగా నిలవాలని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రెండవ సారి సీఎంగా గెలిపించుకునేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, జానపదకళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, మైనారిటీ సెల్ సీమ జిల్లాల ఇన్‌చార్జ్ ఫకృద్దిన్‌షరీఫ్, జిల్లా వక్ఫ్ బోర్డు అధ్యక్షుడు అమ్ము, మైనారిటీ నాయకులు ఖాదర్‌బాషా, ఇర్ఫాన్, జావీద్, మమ్ము, అమ్ముకుట్టి, అస్లాంమురాధి, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ కుటుంబాలు



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే వెంకటేగౌడ

గంగవరం: మండలంలో జనసేన, తెలుగుదేశం పార్టీల నుంచి 20 కుటుంబాలు పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ సమక్షంలో గురువారం వైఎస్సార్ సీపీలో చేరాయి. మండలంలోని డ్రైవర్స్ కాలనీలో పలు అభివృద్ధి పనుల ప్రారంభానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఆయన సమక్షంలో పలువురు టీడీపీ, జనసేన కుటుంబీకులు వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీలో చేరిన వాళ్లకి వైఎస్సార్ సీపీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. వారు మాట్లాడుతూ జనసేన, టీడీపీ సంయుక్తంగా చేస్తున్న ఆగడాలకు విసిగిపోయామని అందుకే ఆ పార్టీలను వీడుతున్నామన్నారు. ప్రజలకు మంచి చేస్తున్న వైఎస్సార్‌సీపీలో చేరడం సంతోషంగా ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో జగనన్న గెలుపు కోసం నిర్విరామంగా కృషి చేస్తామన్నారు. నూతనంగా పార్టీలో చేరిన వారిలో జగదీష్, శివకుమార్, మంజు, మహేష్, బబ్లు, జమీల్, మౌలా, హయాత్, సుబ్బమ్మ, నజీర్, ప్రసాద్, ఆసిఫ్, షాదిక్, మణి, రేష్మ తదితరులు ఉన్నారు.

ఈవీఎంల వినియోగంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న జేసీ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : ఎన్నికల్లో ఓటు వేసే విధానాన్ని తెలుసుకోవాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం ఈవీఎంల వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు వినియోగం చాలా ముఖ్యమన్నారు. ఎన్నికల కమిషన్ అమలు చేస్తున్న ఈవీఎం విధానంలో ఓటు హక్కు వినియోగం ప్రజలు తెలుసుకోవాలని చెప్పారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలిపారు. ఓటు వేసే విధానంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మేయర్ అముద, జెడ్పీ వైస్ చైర్మన్ రమ్య, డీఆర్‌డీఏ పీడీ తులసి, స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొన్నారు.

విధుల్లో అలసత్వం వద్దు

అలసత్వం లేకుండా ఎన్నికల విధులు నిర్వర్తించాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు అన్నారు. కలెక్టరేట్ నుంచి గురువారం ఎన్నికల ప్రక్రియపై క్షేత్రస్థాయి అధికారులతో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితా ప్రక్రియలో ఎలాంటి జాప్యం ఉండరాదని చెప్పారు. పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని తెలిపారు. అలసత్వం వహిస్తే కఠిన చర్యలుంటాయని జేసీ హెచ్చరించారు. ఈ కాన్ఫరెన్స్‌లో డీఆర్‌ఓ పుల్లయ్య పాల్గొన్నారు.

11న సర్వీస్ పుస్తకంతో హాజరుకండి

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పనిచేస్తున్న ఎస్జీటీలు స్కూల్ అసిస్టెంట్ (స్పెషల్ ఎడ్యుకేషన్) ఉద్యోగోన్నతులకు ఈనెల 11 వతేదీన సర్వీస్ పుస్తకంతో హాజరుకావాలని డీఈఓ దేవరాజు తెలిపారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ ఎస్జీటీ కేడర్ నుంచి స్కూల్ అసిస్టెంట్ స్పెషల్ ఎడ్యుకేషన్ కేడర్‌కు ఉద్యోగోన్నతులు కల్పించనున్నట్లు చెప్పారు. దీనికి అర్హులైన ఎస్జీటీలు బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్, సర్వీస్ రిజిస్టర్, ఇతర సర్టిఫికెట్లతో మధ్యాహ్నం 3 గంటలకు డీఈఓ కార్యాలయానికి విచ్చేయాలని డీఈఓ కోరారు.

వైఎస్సార్‌సీపీలో చేరికలు



విజయానందరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన నాయకులు

గుడిపాల: టీడీపీ, జనసేన పార్టీల నుంచి పలువురు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో గురువారం చేరారు. చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి ఆధ్వర్యంలో నారగల్లు పంచాయతీకి చెందిన తెలుగుదేశం, జనసేన నాయకులు పార్టీలో చేరగా విజయానందరెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై పార్టీలో చేరినట్లు వారు తెలియజేశారు. పార్టీలో చేరిన వారిలో విజయ్, విగ్నేష్, రాజేష్, జగదీష్, కుట్టి, మురళితోపాటు మరో 15మంది ఉన్నారు.

విషపు గుళికలు తిని 19 నెమళ్లు మృతి



మృతిచెందిన నెమళ్లు

పలమనేరు: పంట రక్షణ కోసం పెట్టిన విషపు గుళికలను తిని 19 నెమళ్లు మృతి చెందిన సంఘటన పట్టణ సమీపంలోని నగరవనంలో గురువారం వెలుగుచూసింది. ఎర్రచందనం వృక్షాలున్న ప్రాంతాన్ని నగరవనం అటవీ పార్కుగా అధికారులు ఏర్పాటుచేశారు. గుబురుగా ఉండే ఇక్కడి వృక్షాల చాటున నెమళ్లు ఎక్కువగా ఉన్నాయి. దీనికి పక్కనే ఉన్న రైతు పొలంలోకి అడవి పందులు రాకుండా విషపు గుళికలు పెట్టాడు. వీటిని నెమళ్లు తినడంతో 19 వరకూ అక్కడికక్కడ పడి మృతి చెందాయి. ఈ విషయం స్థానికుల ద్వారా అటవీశాఖ సిబ్బందికి తెలిసింది. అయితే గురువారం కూర్మాయి సమీపంలో నూతన నగర వనాన్ని ప్రారంభించేందుకు డీఎఫ్వోతోపాటు ఉన్నతాధికారులు వస్తున్నందున స్థానిక అటవీ సిబ్బంది వీటిని బుధవారమే రహస్యంగా పాతిపెట్టినట్టు సమాచారం . ఈ విషయమై స్థానిక ఎఫ్ఆర్వో శివన్నను వివరణ కోరగా అలాంటిదేమీ లేదన్నారు. అసలు అన్ని నెమళ్లు ఎందుకుంటాయని అనుమానం వ్యక్తం చేశారు. 19 నెమళ్లు చనిపోతే తాము వదిలిపెట్టేస్తామా అనడం గమనార్హం.

కాన్వాయ్ ఆపి.. క్షతగాత్రుడికి మంత్రి సాయం



గాయపడిన యువకుడితో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో ఓ కార్యక్రమానికి వెళుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి రోడ్డుపై గాయపడి ఉన్న ఓ యువకుడిని చూసి కాన్వాయ్ ఆపి.. అతన్ని ఆస్పత్రికి తరలించారు. గురువారం చిత్తూరు సమీపంలోని ముత్తిరేవుల వద్ద ద్విచక్రవాహనంపై వెళుతున్న యువకుడు అదుపు తప్పి పడిపోయాడు. గాయపడిన యువకుడు బాధపడుతుంటే.. అటువైపుగా వెళుతున్న మంత్రి పెద్దిరెడ్డి తన కాన్వాయ్‌ను పక్కకు ఆపారు. కాన్వాయ్ నుంచి దిగి యువకుడి వద్దకు వెళ్లి పలకరించారు. ఏమీ కాదని ధైర్యం చెప్పి, ఒక ప్రైవేటు కారు మాట్లాడి అతన్ని చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులతో ఫోన్‌లో మాట్లాడి, యువకుడికి మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. మంత్రి వెంట ఎంపీ రెడ్డెప్ప, అధికారులు ఉన్నారు.

పచ్చ మీడియా ఉద్యోగుల దొంగ ఓట్లు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు రవీంద్రారెడ్డి

గుడిపాల: 'ఏబీఎన్ రాధాకృష్ణ తరచూ పచ్చ పత్రికలో వైఎస్సార్‌సీపీ నాయకుల దొంగ ఓట్లు చాలా ఉన్నాయి అంటూ వార్తలు రాస్తున్నారు. ప్రస్తుతం ఆ పత్రికలో పనిచేసే ఉద్యోగి రెండుచోట్ల ఓట్లు రాయించుకున్నాడు. ఇది న్యాయమా? రాష్ట్రం మొత్తం మీ వాళ్లంతా ఇలాగే చేస్తున్నారా.. దీనికి మీరు ఏమంటారు?'' అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రశ్నించారు. మండల కేంద్రంలో గురువారం వైఎస్సార్‌సీపీ నాయకుల సమావేశం నిర్వహించారు. అందులో పార్టీ నాయకుడు రవీంద్రారెడ్డి మాట్లాడుతూ, మండల కేంద్రంలోని పోలింగ్ స్టేషన్ 206లో సీరియల్ నెంబర్ 677తో పాటు, 189 పోలింగ్ స్టేషన్‌లో సీరియల్ నెంబర్ 652తో గుడిపాల మండలం ఆంధ్రజ్యోతి ఉద్యోగి రెండుచోట్ల ఓటు హక్కు కలిగి ఉన్నాడని చెప్పారు. దొంగ ఓట్లు రాసుకున్నది ఎవరో ఇక్కడే తేలిపోయిందని చెప్పారు. ఇలాగే తెలుగుదేశం నాయకులకు చాలా చోట్ల రెండు బూతుల్లో ఓట్లు ఉన్నాయని వాటిని మన మందరం గుర్తించి ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయాలని కోరారు.

టెర్రకోట అభివృద్ధికి సర్కారు కృషి



శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న విజయలక్ష్మి

పలమనేరు: టెర్రకోట కళను మరింత అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని ఏపీ హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ బడిగించల విజయలక్ష్మి పేర్కొన్నారు. పట్టణ సమీపంలోని టెర్రకోట సీఎఫ్‌ఎస్సీలో ఏపీ హస్తకళల అభివృద్ధి శాఖ ద్వారా సాగుతున్న హస్తకళాకారుల శిక్షణ కార్యక్రమాన్ని గురువారం ఆమె పర్యవేక్షించారు. వారు తయారు చేస్తున్న మట్టి కళాకృతులను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్రంలో నవరత్నాల ద్వారా ప్రభుత్వం చేతివృత్తుల వారిని ఆదుకుంటోందని తెలిపారు. ఇక్కడ శిక్షణ పొందిన వారికి దేశవ్యాప్తంగా ఉన్న లేపాక్షి ఎంపోరియంలో కళాకృతులను విక్రయించే అవకాశాన్ని కల్పిస్తున్నామని తెలిపారు. పలమనేరు అనగానే టెర్రకోట గుర్తుకొచ్చేలా చేశారని ఇక్కడి వస్తువులు ప్రపంచ దేశాలకు ఎగుమతి కావడం గొప్పవిషయం అన్నారు. ఇక్కడి సమస్యలను సైతం హస్త కళాకారులు ఆమె దృష్టికి తీసుకెళ్లగా పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చంద్రమౌళి, స్థానిక టెర్రకోట కళాకారుల సంఘం అధ్యక్షులు రామక్రిష్ణ, మాస్టర్‌క్రాఫ్ట్ మన్ ఈశ్వరయ్య, డిజైనర్ జోషి, తిరుపతి లేపాక్షి సిబ్బంది పాల్గొన్నారు.

భార్యను కొట్టి చంపేసిన భర్త

గుడుపల్లె: వివాహేతర సంబంధం నేపథ్యంలో భార్యను హత్య చేసిన సంఘటన మండలంలో గురువారం వెలుగుచూసింది. ఎస్ఐ లక్ష్మీకాంత్ కథనం మేరకు, మండలంలోని ఓయన్‌కొత్తూరు పంచాయతీ తలి అగ్రహారంలోని బెత్రాయన్‌కు, తమిళనాడులోని కొళిగూర్ గ్రామానికి చెందిన సెల్వి(36)కి 17 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కొడుకులు ఉన్నారు. కొన్ని రోజులుగా బెత్రాయన్ భార్య సెల్వి వివాహేతర సంబంధాలు పెట్టుకున్నట్లు అనుమానం వచ్చింది. దీనిపై పలు మార్లు భార్యను మందలించినా ఫలితం లేకపోయింది. దీంతో బుధవారం రాత్రి భార్యాభర్తల మధ్య గొడవ జరగడంతో బెత్రాయన్ భార్య సెల్వి‌ని కొట్టి చంపేశాడు. గురువారం ఉదయం బంధువులకు అందరికీ మృతి చెందినట్లు సమాచారం అందించారు. బంధువులు వచ్చి శవాన్ని చూసి ఇది సహజ మరణం కాదని చంపేశారని గుర్తించారు. వెంటనే సెల్వి బంధువులు గుడుపల్లె పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేశారు. దీంతో బెత్రాయన్ తన భార్య సెల్వి అక్రమ సంబంధం పెట్టుకుందని పలు మార్లు హెచ్చరించినా మారలేదన్నారు. అందుకే కొట్టి చంపేశానంటూ చెప్పాడు. వెంటనే బెత్రాయన్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి, శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం కుప్పం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఇది ఉద్యోగుల పక్షపాత ప్రభుత్వం



సమావేశంలో మాట్లాడుతున్న విజయానందరెడ్డి, (ఇన్‌సెట్) ప్రసంగిస్తున్న వెంకట్రామిరెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: ఇది ఉద్యోగుల పక్షపాత ప్రభుత్వమని అందరూ అండగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల ఫెడరేషన్ (ఏపీజీఈఎఫ్) చైర్మన్, వెంకట్రామిరెడ్డి, చిత్తూరు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి కోరారు. చిత్తూరులో గురువారం నిర్వహించిన ఎన్జీఓల సమావేశానికి ముఖ్య అతిథులుగా వచ్చి మాట్లాడారు. అధికారంలో వచ్చిన కొద్దిరోజుల్లోనే జగనన్న సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి లక్షలాది మందికి ప్రభుత్వ ఉద్యోగులు ఇచ్చారని గుర్తు చేశారు. విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యతనిచ్చి వాటి రూపురేఖలు మార్చారన్నారు. కరోనా మహమ్మారితో ఆర్థిక వ్యవస్థ కుదేలైనా, సంక్షేమం మాత్రం రాష్ట్రంలో ఆగలేదని పేర్కొన్నారు. ఒక దృఢ సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తోందని వివరించారు. చిన్న చిన్న సమస్యలను భూతద్దంలో చూడద్దని, దశలవారీగా ఉద్యోగుల సమస్యలు పరిష్కారం అవుతాయని భరోసా ఇచ్చారు. సంక్షేమం, అభివృద్ధి ప్రజలకు అందించడంలో ప్రభుత్వ ఉద్యోగులే సారథులుగా ఉన్నారని చెప్పారు. అన్ని సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా ఉందని వెల్లడించారు. కొందరు చేస్తున్న తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని, నమ్మకమైన నాయకుడిని ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. పరిపాలనలో విప్లవాత్మక సంస్కరణలు తీసుకొస్తున్నారని వాటిని మరోవిధంగా అర్థం చేసుకోవద్దని చెప్పారు. అనంతరం నియోజకవర్గ అభివృద్ధిపై ఉద్యోగ సంఘాల నాయకులు పలు సూచనలు చేశారు. ప్రభుత్వ ఆస్పత్రిలో ట్రామాకేర్, రోడ్డు విస్తరణ, డివిజన్లలో మౌలిక వసతులు, పరిశ్రమలు, ఉద్యోగాల కల్పన చేయాలని సూచించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు గిరిప్రసాద్, రిటైర్డ్ పోలీసు ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మురళీ, మెడికల్ గెజిటెడ్ అసోసియేషన్ నాయకులు శ్రీనివాసమూర్తి, డ్రైవర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పన్నీరు సెల్వం, వీఆర్వో సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు బాలాజీరెడ్డి, రెవెన్యూ, పీఆర్, సచివాలయ, మార్కెట్ కమిటీ, వ్యవసాయ ఉద్యోగుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.